క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తా



యోగా పోటీల్లో మూడో స్థానం సాధించిన కర్నూలు జట్టు

కర్నూలు (టౌన్): ద్వారక తిరుమలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 50వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో కర్నూలు జట్టు 25 పాయింట్లు సాధించి మూడవ స్థానంలో నిలిచి కప్పు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ లక్ష్మీ కాంత రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో యోగా క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తు న్నట్లు తెలిపారు. జిల్లా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి, కార్యదర్శి మునిస్వామి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, శశిధర్ పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

కర్నూలు (టౌన్): ఆరోగ్యానికి, ఆత్మరక్షణకు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని జిల్లా ఉషూ సంఘం అధ్యక్షుడు బిజినేపల్లి సందీప్ అన్నారు. ఆదివారం టీజీవీ స్పోర్ట్స్, యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పెద్ద మార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు కరాటే వంటి ఉషూ మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయాలన్నారు. ఈ క్రీడల వల్ల ఏకాగ్రత, ధైర్యం అలవడుతుందన్నారు. అనంతరం బెల్ట్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరచిన వారికి కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. డైరెక్టర్ టీ.శ్రీనివాసులు, శ్రీనివాసవర్మ, ఎగ్జామినర్లుగా క్రాంతి, హేమలత పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని బ్రైట్ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ మాలిక్ బాషా పేర్కొన్నారు. ఆదివారం ఐడెల్ స్కూల్‌లో ఆ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని అన్నారు. తెలుగు అధ్యాపకురాలు డి.పార్వతిదేవి సేవా కార్యక్రమాల కోసం రూ.10 వేలు విరాళాన్ని ఫౌండేషన్ సభ్యులకు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు వీరారెడ్డి, సబీహా బాను, మజహర్, తెలుగు అధ్యాపకురాలు డి.పార్వతిదేవిని ఘనంగా సన్మానించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి కృష్ణారెడ్డి, అమీర్ అజీజ్, బ్రైట్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్): తైక్వాండో క్రీడలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తైక్వాండో సీనియర్ శిక్షకులు టీ.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న మున్సిపల్ పార్కులో విద్యార్థులకు తైక్వాండో మెళకువలు నేర్పించారు. విద్యార్థులచే ఫైట్ కురుగురే, కటాస్, పుంసే వంటి ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజు 2 గంటల సమయాన్ని తైక్వాండో శిక్షణకు కేటాయిస్తే మంచి ప్రతిభ చాటవచ్చన్నారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి టీ.అజయ్ పాల్గొన్నారు.

27, 28న సీఐటీయూ జిల్లా మహాసభలు

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 27, 28 తేదీల్లో కర్నూలులో జరిగే సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ కర్నూలు మండల మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు దిగాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికుల కడుపు కొడుతుందన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లను తేవడంతో కార్మికులు బానిసలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే 8 గంటల పని విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. అనంతరం కర్నూలు మండల నూతన సీఐటీయూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బీసన్న, హుస్సేనయ్య, ఉపాధ్యక్షులుగా మస్తాన్, చెన్నయ్య, ఏసన్న, సహాయ కార్యదర్శులు నాగేశ్వరి, తిమ్మప్ప, రమీజాబీలతో పాటు మరో 9 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(హాస్పిటల్): వీరశైవ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు వీరశైవ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.చంద్రశేఖరప్ప, కార్యదర్శి జి.జె.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్‌లో 90 శాతం పైగా మార్కు లు సాధించిన విద్యార్థులు, మెడిసిన్, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐటీ ర్యాంకులు సాధించిన వారు, అత్యుత్తమ కాలేజీల్లో సీటు సాధించిన వారు, డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వీరశైవ విద్యార్థులు, యువతకు దసరా సెలవుల్లో పురస్కారాలు అందజేస్తామన్నారు. అర్హులైన వారు ఈ నెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 98857 92122, 94933 22622 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

రహ'దారిద్ర్యం'

- గుంతలమయంగా మారిన అర్బన్ కాలనీల రోడ్లు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రయాణం నరకప్రాయం



లక్ష్మీపురం రోడ్డు దుస్థితి



గుంతలమయంగా మారిన జొహరాపురం - వెంకాయపల్లె రోడ్డు

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో ఆర్అండ్‌బీ రోడ్లు, ఇతర రోడ్లను సంక్రాంతి కల్లా బాగు చేస్తామన్నారు. అయితే కల్లూరు అర్బన్, కర్నూలు నగరంతో పాటు 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్‌లో 16 వార్డులు ఉండగా, అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. అయినా కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర శివారులోని జోహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి అడుగడుగున్నా గుంతలు పడి ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారి వెంట రోజూ వందల సంఖ్యలో వాహనాలు ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, వెంకాయపల్లె, గార్గేయపురానికి రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక రోడ్లను పట్టించుకోవడం లేదనని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఎదురుగా ఎదైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది. రోడ్డు వేయడంతో పాటు ఇరువైపులా రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు. వర్షాలు కురిసినప్పుడల్లా రోడ్డుపై గుంతలు ఉండడంతో వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుంతల దగ్గర ఎదురుగా ఎదైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

– 44వ జాతీయ రహదారి నుంచి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ దారిలోనే కేజీబీవీ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. కేజీబీవీ విద్యాలయం ముందు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, కళాశాల విద్యార్థులు, వ్యవసాయ కూలీలు నిత్యం తిరుగుతుంటారు. వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఎరువులు, పురుగు మందులను ఎద్దుల బండ్లపై, ద్విచక్రవాహనాలపై తీసుకెళ్తుంటారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టిన రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

సమాజ శ్రేయస్సుకు కంకణబద్ధులు కావాలి



పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: సమాజ శ్రేయస్సుకు కంకణబద్ధులు కావాలని ఇస్కాన్ ప్రవచకులు జయగోవింద్ ప్రభు సూచించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణా తరగతులు, శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహారాజ భోగ నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే ధాతృత్వ గుణం పెరుగుతుందన్నారు. భారత భాగవతంను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఈ గ్రంథాలు మానవ మనుగడకు మార్గదర్శకాలు అన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన పెరగాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కర్నూలు(హాస్పిటల్): నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెరగాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి అన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సుశీల నేత్రాలయ సౌజన్యంతో ఆదివారం ఉదయం కర్నూలులో నేత్రదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ కేజీ.గోవిందరెడ్డితో పాటు కంటి వైద్యులు డాక్టర్ పి.సుధాకర్‌రావు, విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశంలో కోటి మంది మరణిస్తున్నారని, వారిలో పది శాతం మంది నేత్రదానం చేయగలిగితే దేశంలో కంటిచూపు లేక బాధపడే వారే ఉండరన్నారు. మూఢ నమ్మకాలను వీడి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారిణి డాక్టర్ సంధ్యారెడ్డి, కంటి వైద్యులు నేహా, రాఘవ ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, ఆవోపా సభ్యులు

కర్నూలు కల్చరల్: ఆవోపా ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోజా వీధిలోని ఆవోపా సేవా సదన్‌లో విద్యానిధి రజతోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ఆవోపా విద్యానిధి రజతోత్సవ వేడుకల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమితులైన ఆర్యవైశ్య ప్రతినిధులను అభినందించారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేస్తూ చక్కటి వేషధారణతో ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్న ఆర్యవైశ్య మహిళలను అభినందించారు. ఆవోపా రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పువ్వాడ చంద్రశేఖర్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, ఆవోపా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి మురళి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ కళాకారులకు సత్కారం



డీఈఓ శామ్యూల్‌పాల్‌తో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్: నవ సమాజ నిర్మాతలు గురువులని డీఈఓ శామ్యూల్‌పాల్ అన్నారు. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాహితీ, కళా రంగాల్లో పేరు పొందిన 15 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయులకు గురుతరమైన బాధ్యత ఉందన్నారు. కళాకారులైన ఉపాధ్యాయులకు ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని తద్వారా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు రాష్ట్ర వ్యాప్తంగా సాహిత్య కళారంగాల్లో రాణిస్తున్నవారన్నారు. ఇటీవల మరణించిన రెండు నంది అవార్డుల గ్రహీత వన్నెం బలరాం చిత్ర పటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. విశ్రాంత ఎంఈఓ రాజారత్నం, కళాక్షేత్రం కార్యదర్శి సి.యాగంటీశ్వర్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌మియ్యా, సభ్యులు, సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు డాక్టర్ హరికిషన్, దేవేంద్రప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, పుల్లా రామాంజనేయులు, రాముడు, రేవుల శ్రీనివాసులు, మునిస్వామి, చంద్రమౌళిని, కల్యాణదుర్గం స్వర్ణలత, నీలిమ, బాల వెంకటేశ్వర్లు, చంద్రకంటి మద్దయ్య, సుధీర్‌రాజు, భాస్కర్, దాసరి వెంకట రమణ ఉన్నారు.


యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి



రణభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు సిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదని, ఇందుకు నిరసనగా ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ నాయకులు వెల్లడించారు. ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆ సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు ఏళ్లుగా పెండింగ్‌లోనే ఉన్నాయని, వీటిని పరిష్కరించాలని పలు దఫాలుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు యోహోషువ, తిమ్మన్న, ఇబ్రహీం, సోమన్న, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలించాలి



మాట్లాడుతున్న చిక్కం జానయ్య మాదిగ

కర్నూలు(సెంట్రల్): జిల్లా పశ్చిమ ప్రాంతంలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని నియోజకవర్గాల్లో రోజురోజుకు అంటరానితనం పెరిగిపోయి మతాలు, కులాల మధ్య చిచ్చు రేగుతోందని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1)ఏ, 19(1)హెచ్ ప్రకారం ఏ మతమైనా, ఏ దేవుడినైనా కొలవొచ్చన్నారు. అయితే పశ్చిమ ప్రాంతంలో కొందరు హిందు సంఘాల పేరు తో క్రిస్టియన్లు, ముస్లింలపై వివక్ష చూపుతున్నారన్నారు. దళితులు, గిరిజనులు ఆలయాల్లోకి రానీయకుండా అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కోరుతున్నట్లు చెప్పారు. నాయకులు సత్యన్న ప్రశాంత్‌కుమార్, పోలకల్ మహేష్, అనిల్, అశోక్, లింగన్న పాల్గొన్నారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూసివేత

కర్నూలు కల్చరల్: భాద్రపద శుక్ల పౌర్ణమి రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం జిల్లాలోని దేవాలయాలను మూసివేశారు. గ్రహణ కాలం ముగిశాక సోమవారం ఉదయం యథావిధిగా ఆలయాలను తెరచి శుద్ధి, సంప్రోక్షణ చేయనున్నారు. అనంతరం నిత్య పూజలతో యథావిధిగా భక్తులకు దర్శనం కల్పించనున్నారు.

కళారంగాల్లో నైపుణ్యంతోనే గుర్తింపు



అతిథులతో నృత్యాలు ప్రదర్శించిన విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కళారంగాల్లో నైపుణ్యం ఉంటేనే గుర్తింపు వస్తుందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. సీక్యాంప్ కళాక్షేత్రంలో ఆదివారం సాంస్కృతిక పోటీలు, నాట్యగురువు, నాట్యరత్న హెచ్.వెంకటస్వామి సంస్మరణ సభ జరిగింది. పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. నాట్య విద్యార్థులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ మన్సూర్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అక్తర్‌బాను, నాట్య గురువు నారాయణస్వామి, బుద్ధి అసోసియేషన్ అధ్యక్షుడు చిరంజీవి మాట్లాడారు. వెంకట స్వామి కళా రంగానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. నిర్వాహకులు వినోద్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులు శ్రీకృష్ణ రాయబారంలోని ఓ ఘట్టాన్ని ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం కళాకారులు నాగరాజు, ఫ్రాన్సిస్, శాంసన్‌లను సత్కరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న కర్నూలు జిల్లా మహిళా అధ్యక్షురాలు రేణుక



ఎస్వీ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతాయుతంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి సూచించారు. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలుగా నియమితులైన (డిప్యూటీ మేయర్) ఎస్.రేణుక ఆదివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి ఉమామహేశ్వరమ్మ, యువ నాయకుడు శివనరసింహారెడ్డిని, అలాగే కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, సతీమణి విజయమనోహరి, అలాగే పార్టీ నేతలు కంగాటి శ్రీదేవి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సతీష్‌లను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడి పని చేసేవారికి తప్పనిసరిగా పదవులు వరిస్తాయన్నారు. పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మిరెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, కె.వీ.రమణారెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, శివశంకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ బాలికల హాస్టల్‌కు ఫ్యాన్ల వితరణ

కర్నూలు(అర్బన్): నగరంలోని బీసీ కళాశాల బాలికల వసతి గృహానికి కల్లూరు పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆరు సీలింగ్ ఫ్యాన్లను అందించి తమ ధాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటేశ్వర్లు, చలపతి, సంయుక్త కార్యదర్శి సీ.నాగరాజు తదితరులు వసతి గృహానికి చేరుకొని ఫ్యాన్లను వసతి గృహ సంక్షేమాధికారిణి కనకలతకు అందించారు. వారు మాట్లాడుతూ.. కల్లూరు పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటైనప్పటి నుంచి వివిధ సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థుల ఉన్నత విద్యకు మరికొందరు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలన్నారు. అసోసియేషన్ నేతలు ఎన్‌డీబీ బలరాం, కే నజీర్ అహమ్మద్, బీ శ్రీనివాసులు, టీ ఈశ్వరయ్య, వీ సుబ్బన్న పాల్గొన్నారు.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరవుతున్నారని తెలిపారు. నగరపాలక పరిధిలోని కాలనీలలో మౌళిక సదుపాయాలు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి స్థానిక సమస్యలపై ప్రజలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోపు పరిష్కరిస్తామని, అర్జీ స్థితిగతులను https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో స్వయంగా పరిశీలించవచ్చని తెలిపారు.

యువకులపై లాఠీచార్జ్ అమానుషం

కర్నూలు(సెంట్రల్): ఎమ్మిగనూరులో ఆటో నడుపుకుంటున్న యువకులపై పోలీసులు దాడి చేయడాన్ని మానవ హక్కుల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని ఆ సంస్థ చైర్మన్ దేవరశెట్టి పరమేశ్వరయ్య తెలిపారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనం సందర్భంగా ఎమ్మిగనూరులో పోలీసులు ప్రవర్తించిన తీరు గర్హనీయమన్నారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన పోలీసులు వారిపై దాడి చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఫణీంద్ర, శివకుమార్, మీసాల సుమలత పాల్గొన్నారు.

అరకొర యూరియాతో అవస్థలు

ఓర్వకల్లు: మండలంలో అరకొరగా వచ్చిన యూరియా సరిపడక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజుకు 300 నుంచి 400 బస్తాలకు మించి రావడంలేదని, వచ్చిన బస్తాలను రాత్రికి రాత్రి డీలర్లకు అనుకూలమైన రైతులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం లొద్దిపల్లె, ఉప్పలపాడు గ్రామాల్లోని రెండు రైతు సేవా కేంద్రాలకు కలిపి 450 బస్తాల మేర యూరియా వచ్చినట్లు ఏఓ మధుమతి ఆదివారం తెలిపారు. రైతుకు 1–2 బస్తాల చొప్పున ఇవ్వడం జరుగుతోందన్నారు.

గురువులే సమాజ మార్గదర్శకులు



ఉపాధ్యాయుడు ఈశ్వరయ్య దంపతులను సన్మానిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: గురువులే సమాజ మార్గదర్శకులు, స్ఫూర్తి ప్రదాతలని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్, నైస్‌యూత్ ఫర్ కల్చరల్ అండ్ ఎడ్యుకేషన్ సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం ఓల్డ్‌సిటీలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ సమావేశ భవన్‌లో.. ఉపాధ్యాయ వృత్తిలో రాణిస్తూ సమాజ సేవలో పాల్గొంటున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ఉత్తమ సేవా అవార్డులను అందజేశారు. ఉత్తమ సేవలందిస్తున్న 25 మంది ఉపాధ్యాయులకు అవార్డులతో సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నాగేశ్వరరావు, కేవీ సుబ్బారెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఐ.విజయకుమార్‌రెడ్డి, డీఎస్పీ మహబూబ్ బాషా మాట్లాడారు. కార్యక్రమంలో మురారి శంకరప్ప, డాక్టర్ జయప్రకాష్, గోపీనాథ్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ బాలేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

రచనలు సమాజ చైతన్యానికి దోహదపడాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు, అతిథులు

కర్నూలు కల్చరల్: రచనలు సమాజ చైతన్యానికి దోహదపడాలని తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ అన్నారు. ప్రముఖ రచయిత కేపీఆర్ శర్మ రచించిన 'కవితా (వి)హారం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం వీఆర్ కాలనీలోని సాయి రాఘవ రెసిడెన్సీలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రచనలో స్త్రీల సమస్యలు, నిరాధరణకు గురవుతూ వృద్ధాశ్రమాలను ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు, రైతులు, సైనికులకు సంబంధించి ప్రధాన భూమిక ఉందన్నారు. డాక్టర్ హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధాశ్రీ, రంగనాథ శర్మ, కల్యాణ శాస్త్రి మాట్లాడారు. రచయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని పుస్తక సమీక్ష చేశారు. నాట్య గురువులు భార్గవ కుమార్, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి క్వింటాకు రూ.3 వేలు ధర ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): ఉల్లి క్వింటాకు రూ.3 వేలు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష డిమాండ్ చేశారు. ఉల్లికి గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్లపైకి రావడం బాధకరమన్నారు. ఆయన ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. పండుగలు రావడంతో కొనుగోలుదారులు లేక మార్కెట్ మూతపడిందని కారణాలు చెప్పడం తగదని, రైతులు చోమటోడ్చి పండించిన పంటకు తగిన విలువ లభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమేనని విమర్శించారు. క్వింటా ఉల్లికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1200 ఏమాత్రం సరిపోదని, కనీసం రూ.3 వేలకు కొనుగోలు చేస్తే అన్నదాతలకు గిట్టుబాటు అవుతుందన్నారు. రైతులు పంటలను నిల్వ చేసుకోవడానికి కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో ఉల్లి, టమోటా రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ముందుకు రాకపోతే ఆత్మహత్యలు తప్పా మరో మార్గంలేదని పేర్కొన్నారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు



క్షతగాత్రున్ని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు–వెల్దుర్తి రోడ్డు వినాయక ఘాట్ సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు..మండలంలోని గోరంట్లకు చెందిన బాలు బైక్‌పై కోడుమూరుకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మరోవైపు దేవనకొండ మండలం కప్పట్రాళ్లకు చెందిన లాల్‌బాషా, రంగస్వామి ఇద్దరూ మరో బైక్‌పై వస్తుండగా వినాయక ఘాట్ వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బాలు, లాల్‌బాషాలకు తీవ్ర గాయాలు కాగా, రంగస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కోడుమూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.